వేతనాలు అందక అవస్థలు

- నాలుగు నెలలుగా గ్రామపంచాయతీ సిబ్బంది ఎదురుచూపులు
- ఖాతాలను ఫ్రీజింగ్‌లో పెట్టిన ప్రభుత్వం
- కుటుంబాలు గడవక కార్మికుల ఇబ్బందులు



అడ్డగూడూరులో రోడ్డు శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

అడ్డగూడూరు : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదు. దీంతో వారు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి ఏర్పడింది. అసలే చాలీచాలని వేతనాలతో పనులు చేస్తున్న వారికి జీతాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేస్తే వారికి నెలకు రూ.8500 వేతనం అందిస్తారు. అదికూడా సక్రమంగా అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో కుటుంబ పోషణ మరింత భారంగా మారుతుంది. మండలంలోని 17గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో సుమారు 74మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వారికి సంక్రాంతి పండకు కూడా జీతాలు వేయకపోవడంతో పండుగ రోజు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఉగాది పండకైనా జీతాలు వస్తాయోమోనని కార్మికులు వేయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు. కిరాణం దుకాణాల్లో, తెలిసిన వారి వద్ద అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు నెలలుగా ఇబ్బందులు..

కార్మికులకు నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలు ఇప్పటికి అందలేదు. ప్రస్తుతం ఐదోనెల మార్చి కూడా పూర్తికావస్తుండడంతో ఎప్పుడు వేతనాలు ఇస్తారోనని ఎదురుచూస్తున్నారు. నాలుగు నెలల జీతంలో కనీసం రెండు నెలల జీతమైనా ఇస్తే కొంత మేలు జరుగుతుందని కార్మికులు వాపోతున్నారు. కార్మికులు ఉదయం 5గంటల నుంచి విధుల్లో చేరితే సాయంత్రం 5గంటలు దాటినా ఇంటికి వెళ్లలేని పరిస్థితి. దీంతో వారు పూర్తిగా గ్రామపంచాయతీ జీతంపైనే ఆధారపడటంతో ఇల్లు గడవడం కష్టంగా మారిందని, కిరాణషాపుల్లో మూడు నెలలగా బాకీ ఉండడంతో ఉద్దెర కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. మండలంలోని 74మంది కార్మికులకు ఒక్కో కార్మికుడికి రూ.8500 చొప్పున రూ.6,29,000 చెల్లించాల్సి ఉంటుంది. నాలుగు నెలలకు రూ.2,51,6,000లక్షలు చెల్లించాల్సి ఉంది.

అకౌంట్లను ఫ్రీజింగ్‌లో పెట్టిన ప్రభుత్వం..

అప్పుడప్పుడు కొంత ఆలస్యమైనా సిబ్బందికి ప్రతినెలా 10వతేదీ వరకు జీతాలు చెల్లించేవారు. నిధుల కొరత లేదని, ప్రభుత్వ ఆర్థికశాఖ పలు కారణాలతో అకౌంట్లను ఫ్రీజింగ్‌లో పెట్టడంతోనే బిల్లులు రావడంలేదని, నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొందని అధికారులు అంటున్నారు. నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించిన జీతాల చెక్కులను ఎస్టీఓలో జమచేశామని గ్రామ పంచాయతీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి ఇబ్బందులను పరిష్కరించాలని ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది వాపోతున్నారు.

కుటుంబం గడవటం కష్టంగా ఉంది

నాలుగు నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. కుటుంబ అవసరాల కోసం కిరాణదుకాణాల్లో సరుకులు ఉద్దెర ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి రెండు నెలల జీతాలైనా విడుదల చేయాలి.



– బాలెంల మల్లయ్య, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు

రెండు నెలల చెక్కులు ఎస్టీఓలో జమచేశాం

గ్రామ సిబ్బంది నవంబర్, డిసెంబర్ నెలల జీతాల బిల్లులు చేసి చెక్కులను ఎస్టీఓలో జమ చేశాం. జీతాల చెల్లింపుకు ఎలాంటి నిధుల కొరత లేదు. ప్రభుత్వం అకౌంట్లను ఫ్రీజింగ్ చేయడంతో ఎలాంటి బిల్లులు పాస్‌కావడం లేదు. ప్రభుత్వం అకౌంట్ల ఫ్రీజింగ్ ఎత్తివేసిన వెంటనే సిబ్బంది ఖాతాల్లో జీతాలు జమ అవుతాయి.

– ప్రేమలత, ఎంపీఓ, అడ్డగూడూరు

క్లుప్తంగా

ఆలయ హుండీ లెక్కింపు



నగదు లెక్కిస్తున్న ధర్మకర్తలు, అధికారులు

బీబీనగర్ : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో గల శ్రీలింగబస్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఎండోమెంట్ అధికారుల సమక్షంలో హుండీ లెక్కింపుతో పాటు కోడెలు, దూడలను వేలం వేశారు. నెల15రోజులకు భక్తులు సమర్పించుకున్న నగదును లెక్కించగా రూ.8లక్షల 37వేల 996 వచ్చినట్లు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సుమతి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ. నరేందర్‌రెడ్డి, చైర్మన్ వాకిటి బస్వారెడ్డి, సర్పంచ్ గణేష్‌యాదవ్, ధర్మకర్తలు ముత్యాలు, అంజమ్మ, భాస్కర్ పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

వలిగొండ : మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన పైళ్ల గోపిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడు బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం కలిగిఉండడంతో బీమా నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును బుధవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆయన క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా మండలంలోని ప్రొద్దుటూర్‌కు చెందిన సిద్దబోయిన భిక్షపతికి రూ.2లక్షల 60వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, చిట్టెడి జనార్దన్‌రెడ్డి, మమతనరేందర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

సావిత్రమ్మకు సన్మానం



సావిత్రమ్మను సన్మానిస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్

మోత్కూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో బుధవారం మండలంలోని దాచారం గ్రామానికి చెందిన కొడుకులను ప్రయోజకులను చేసిన కునెబోయిన సావిత్రమ్మను కలెక్టర్ పమేలా సత్పతి, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. సావిత్రమ్మ భర్త భిక్షమయ్య మరణించడంతో చిన్న పిల్లలను కష్టపడి చదివించడంతో పెద్దబ్బాయి మల్లయ్య హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చదువుతున్నాడు. చిన్నబ్బాయి స్వామి ఎస్ఐగా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోరుపల్లి శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, మహిళా సంక్షేమ జిల్లా అధికారి కృష్ణవేణి తదితరులున్నారు.

జెడ్పీటీసీ శారదకు సన్మానం

మండల జెడ్పీటీసీ, జిల్లా పరిషత్ వర్క్స్ కమిటీ సభ్యురాలు గోరుపల్లి శారదను బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ పమేలా సత్పతి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణవేణి, పలువురు మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రానికి చెందిన సూరేపల్లి మాధూర్ కీర్తనల పెళ్లి సందర్భంగా వారు రూ.8వేల విలువైన పుస్తకాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి బుధవారం బహూకరించారు. ఈ పుస్తకాలను ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు.

మంచినీటి క్యాన్ల పంపిణీ



క్యాన్లు అందజేస్తున్న బీర్ల అయిలయ్య

తుర్కపల్లి : మండలంలోని వాసాలమర్రి గ్రామంలో బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోనే వాసాలమర్రిని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పి, ఇంత వరకు ఎటువంటి అభివృద్ధి సీఎం కేసీఆర్ మొదలుపెట్టలేదన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఎంపీటీసీ కానుగంటి శ్రీనివాస్, మోహన్‌బాబునాయక్, ప్రతిభారాజేశ్‌నాయక్, సర్పంచ్ బిచ్చునాయక్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలతో తుర్కపల్లి సస్యశ్యామలం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



తుర్కపల్లి కెనాల్‌ను పరిశీలిస్తున్న విప్ సునీత

తుర్కపల్లి : గోదావరి జలాలతో తుర్కపల్లి మండలం సస్యశ్యామలమవుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మల్కాపూర్ వద్ద గోదావరి జలాలు వచ్చే కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కొండపోచమ్మ సాగర్ నుంచి దామరకుంట కెనాల్ ద్వారా ఎం.తుర్కపల్లి కెనాల్‌తో 47చెరువులకు నీరు అందనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం దామరకుంట నుంచి మల్కాపూర్ వరకు ఉన్న చెరువుల్లో నీరు చేరిందని, ప్రస్తుతం 19చెరువులకు నీరు అందుతుందని, త్వరలోనే మల్కాపూర్ నుంచి బొమ్మలరామారం మండలం పిల్లిగుండ్లతండా వరకు 8కిలోమీటర్ల మేర పనులు పూర్తి అయితే అన్ని చెరువులకు నీరు అందుతుందన్నారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం నుంచి కొండపోచమ్మ సాగర్‌కు నీరు తెచ్చి ఆ నీటిని కాలువల ద్వారా ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నారని అన్నారు. చెరువులు నిండితే భూగర్భజలాలు కూడా పెరుగుతాయని అన్నారు. ఆమె వెంట ఎంపీటీసీ గిద్దె కరుణాకర్, సర్పంచ్ అమలబాలకృష్ణ, రైతులు ఉన్నారు.

కంటి వెలుగు దేశానికే ఆదర్శం

ఆలేరురూరల్ : కంటి వెలుగు దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. బుధవారం పట్టణంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. కంటి వెలుగుతో అనేక మంది లబ్ధిపొందుతున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా కంటి వెలుగు పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. అనంతరం ఆలేరు పురపాలిక, మండల పరిధిలోని కంటి వెలుగు కార్యక్రమం ప్రగతిని నోడల్ వైద్యాధికారి, నవీన్‌కుమార్ ద్వారా దస్త్రాలను పరిశీలించారు. అనంతరం ఆమె కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మొరిగాడి మాధవి, సర్పంచ్ కోటగిరి పాండరి, దాసి సంతోష్, ఆడెపు బాలస్వామి, వడ్ల శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌పై కలెక్టర్ ఆరా !

మోత్కూరు : మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌కు 10షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించి ప్రారంభించి వదిలేశారు. దీంతో ఏడాది కాలంగా నిరుపయోగంగా ఉండడంతో పాటు నెలకు సుమారు రూ.లక్ష ఆదాయం కోల్పోతున్న వైనంపై సాక్షి దినపత్రికలో 'లక్షలు వెచ్చించారు...వదిలేశారు'అనే కథనం బుధవారం ప్రచురితమయ్యింది. దీంతో స్పందించిన కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా వ్యవసాయ మార్కెట్ అధికారి సబిత ఆరా తీశారు. మడిగెలు నిరుపయోగంగా ఉండటానికి కారణాలు ఏమిటీ ? తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కెట్ కార్యదర్శి ఎదుళ్ల వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. దీనిపై నివేదికను సమర్పించాలని ఆదేశించినట్లు తెలిసింది.

కాన్షీరాం సేవలు మరువలేనివి



భువనగిరిటౌన్ : కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



గుండాలలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం చేసిన సేవలు మరువలేనివని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ బండారు రవివర్ధన్ అన్నారు. బుధవారం కాన్షీరాం జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బండారు రవివర్ధన్, రామచంద్రయ్య, దాసు, సంతోష ఉన్నారు.

చౌటుప్పల్ : బీఎస్పీ నేత కాన్షీరాం 89వ జయంతిని బుధవారం పట్టణ కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అందోజు శంకరాచారి, తగరం సుభాష్‌చంద్రబోస్, నాగేంద్రబాబు, నర్సింహ, పరమేష్, రమేష్, ధానయ్య, భిక్షం ఉన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుక్క శ్రీకాంత్, గుండు కృష్ణ, అజయ్, చందు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 89వ జయంతి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డం శ్రీకాంత్, చిప్పలపల్లి సురేష్, రాజుయాదవ్, వెంకటేష్, సంతోష్, వార్డు మెంబర్ పాలడుగు చంద్రకళ తదితరులున్నారు.

రాజాపేట : మండల కేంద్రంలో కాన్షీరాం జయంతిని బుధవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము ప్రకాష్, జిల్లా మహిళా కన్వీనర్ సరిత, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రాపోలు నర్సిరెడ్డి, జిల్లా కన్వీనర్ గంధమల్ల లింగస్వామి, నాయకులు కలకుంట్ల కొమురయ్య, శ్రీకాంత్, వెంకటేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు



భూదాన్‌పోచంపల్లి : పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



చౌటుప్పల్ : పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

యాదగిరిగుట్ట : ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని యాదగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలి రోజు పరీక్షలకు 177మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 166మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

వలిగొండ : ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు మొదటిరోజు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 153 మంది విద్యార్థులకు గాను 145మంది, లోతుకుంట మోడల్ కళాశాలలో 184 మంది విద్యార్థులకు గాను 175మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్స్ లక్ష్మీకాంత్, జి.రాము తెలిపారు.

చౌటుప్పల్ : పట్టణంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. స్థానికంగా బాలికల గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గాయత్రి జూనియర్ కళాశాలలో రెగ్యులర్ విద్యార్థులకు, మోడల్ కళాశాల, మాతృశ్రీ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరంలో 1148 మంది విద్యార్థులకు గాను 1070 మంది విద్యార్థులు హాజరయ్యారు.

రామన్నపేట : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 145మంది విద్యార్థులకు గాను 134మంది, శ్రీహిందూ కళాశాలలో 233 మంది విద్యార్థులకు గాను 211మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు బుంగ సంజీవ, కె.నర్సింహారెడ్డి తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మోటకొండూర్ : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల పేరును రాష్ట్రంలో చెప్పుకునేలా ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని ప్రిన్సిపాల్ జ్యోతి అన్నారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఆల్‌దిబెస్ట్ చెప్పి మాట్లాడారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150మందికి గాను ఇద్దరు, మోడల్ స్కూల్‌లో 177కు గాను ఒక్కరు గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ కోట విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

బొమ్మలరామారం : ఇంటర్మీడియట్ పరీక్షల ప్రారంభం రోజు బుధవారం మండలంలో 27మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్‌లోని సెంటర్‌లో 218మంది విద్యార్థులకు గాను 197 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సెంటర్‌లో 263మందికి గాను 257 మంది హాజరయ్యారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, సర్వేల్‌లో గురుకుల కళాశాలలో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 113మంది విద్యార్థులు, ఆదర్శ పాఠశాలలో 174మంది, సర్వేల్ గురుకుల కళాశాలలో 155 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తిరుమలనాథుడికి పరమపదోత్సవం



పరమపధోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామంలోని శ్రీ తిరుమలనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు కాందూరి లక్ష్మీనారసింహ చార్యులు సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులకు ద్రవిడ వేద పారాయణంతో అధ్యయన ఉత్సవాలు, ప్రబంధ సేవాకాలం నిర్వహించారు. రాత్రి స్వామి వారికి పరమపధోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు మచ్చ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ గొడుగు శోభచంద్రమౌళి, ఆలయ కమిటీ చైర్మన్ రాగుల బల్‌రామ్, రంగా రామాగౌడ్, మహేష్, జమాలొద్దిన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిక అందజేత

శ్రీ తిరుమలనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి, గోట్ అండ్ షిప్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్‌లకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ ధ్యేయం



వలిగొండ : కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శశికళారెడ్డి

తుర్కపల్లి : అంధత్వ నివారణే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని గంధమల్ల సర్పంచ్ వాణి పరమేష్‌యాదవ్ అన్నారు. మండలంలోని గంధమల్లలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మడిశెట్టి భాస్కర్, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ మండల సెక్రెటరీ జనరల్ పరమేష్‌యాదవ్, మెడికల్ ఆఫీసర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ముద్దసాని శశికళారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని మొగిలిపాకలో కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ముద్దసాని కిరణ్ రెడ్డి, నర్సింహ, శంకరయ్య, రమేష్, విష్ణు, సత్యరాములు, భిక్షపతి, డాక్టర్ రమ్యారెడ్డి, మానస, వైద్యసిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని డిఫెన్స్ వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు గుమ్మడెల్లి పరశురాములు మాట్లాడారు. వ్యవస్థలో వినియోగదారుడే రారాజు అని, వస్తు సేవలో నాణ్యత కొరవడిన, నష్టపోయినా పరిహారాన్ని పొందవచ్చన్నారు. ఎలాంటి రుసుము లేకుండా వినియోగదారుల ఫోరంలో కేసు వేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కేసగల్ల రాజు, కోశాధికారి గుగ్గిల్ల కృష్ణ, కార్యవర్గ సభ్యులు సతీష్, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



మొక్క నాటుతున్న ఎంపీపీ దర్శనాల అంజయ్య

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని పూలపల్లి సంజీవరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఉద్యానవనశాఖ అధికారి షేక్ నసీనా, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్‌ఆఫీసర్ మమత ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య పాల్గొని ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం అందజేస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రివేణి ఎంపీటీసీ పెండెల భారతమ్మ, ఏఈఓ దయాకర్, రైతులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

రామన్నపేట : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 17న భువనగిరిలో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లెల పెంటయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన రైతు, కార్మిక సంఘాల సమావేశంలో వారు మాట్లాడారు. రైతు చట్టాలతో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టడానికి కుట్ర చేస్తుందని ఆరోపించారు. నూతన కార్మిక చట్టాలతో శ్రమ దోపిడీకి తెర తీస్తుందన్నారు. సమావేశంలో బొడ్డుపల్లి వెంకటేశం, విజయభాస్కర్, ఉపేందర్, అంజయ్య, హనుమంతు, నర్సింహ, కూనూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేక అశోక్‌రెడ్డి

పత్తికి మద్దతు ధర కల్పించాలి

గుండాల : పత్తి క్వింటాకు రూ.10వేల మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పోతరబోయిన సత్యనారాయణ, ఎండీ.ఖలీల్, బత్తిని భిక్షం, అబ్బయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని గౌస్‌కొండ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన తూపెల్లి సత్తమ్మకు రూ.39వేలు, మర్రి వెంకట్‌రెడ్డికి రూ.24వేల చెక్కులను బుధవారం బాధిత కుటుంబాలకు సర్పంచ్ పక్కీరు లావణ్యాదేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వాకిటి బాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుర్రం బాల్‌రెడ్డి, నోముల శ్రీనివాస్‌రెడ్డి, కానుగు పోషయ్య, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, అశోక్, దేవేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రహదారి దిగ్బంధనాన్ని విజయవంతం చేయాలి

చౌటుప్పల్ : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4న పట్టణ కేంద్రంలో చేపట్టనున్న జాతీయ రహదారి దిగ్బంధాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బోయ లింగస్వామి, ఎర్ర శంకర్, మండల కార్యదర్శి బొడ్డు శ్రావణ్ బుధవారం తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

చౌటుప్పల్ : పట్టణానికి చెందిన చెరుకు యాదయ్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో బుధవారం రాజీవ్ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో పరామర్శించారు. అనంతరం వైద్యఖర్చులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఖయ్యూం, నర్సింహ, రాజయ్య ఉన్నారు.

నర్సరీ పరిశీలన

బీబీనగర్ : మండలంలోని జియాపల్లి తండాలో గల నర్సరీని బుధవారం ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో నీటి సౌకర్యం లేకపోవడంతో సొంత డబ్బులతో విద్యుత్ సరఫరాను ఏర్పాటు చేయించారు.

భట్టి విక్రమార్కకు వినతి

యాదగిరిగుట్ట : పట్టణంలో 50ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌స్టేషన్‌ను మరో చోటకు తరలించే ప్రయత్నం జరుగుతుందని, బస్టాండ్‌ను తరలించకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని డీసీసీ కార్యదర్శి కల్వకొలను సతీష్‌రాజ్ సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు వినతిప్రతం అందజేశారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో కలిసి పట్టణంలో నెలకొన్న సమస్యలను విన్నవించారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు

వలిగొండ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్ రెడ్డి పార్టీ మారుతున్నారని చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిల్‌కుమార్ రెడ్డి పార్టీ మారుతున్నట్లు బుధవారం ఓ దినపత్రికలో ప్రచారం చేశారని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తప్పుడు సమాచారం ప్రచురించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బాతరాజు బాల్‌నర్సింహ, సామ రాంరెడ్డి, ఉప్పల్ రెడ్డి, రవి, సుధాకర్, రాజు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

రామన్నపేట : మండల కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ యాదగిరిగుట్ట డిపో ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి.శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్ మాట్లాడారు. కార్యక్రమంలో డిపో అధికారులు టి.వెంకటేశం, కె.కృష్ణారెడ్డి ఎన్‌పీఆర్డీ జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్, మండల కార్యదర్శి లింగస్వామి, ఉపాధ్యక్షుడు టి.యాదగిరి, పరశురామ్, గణేష్ పాల్గొన్నారు.

నిమిషం నిబంధన ఎత్తివేయాలి

మోత్కూరు : పరీక్షలకు నిర్ణీత సమయం నిమిషం దాటిన నిబంధనను ఎత్తివేయాలని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కారుపోతుల వెంకన్నగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో సవీర్, నరేష్, శ్రీశైలం, శివకుమార్, రాజేష్ ఉన్నారు.

బహుమతులు అందజేత

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలో మ్యాక్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బుధవారం నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మోత్కూరు అంగడి బజార్ ప్రథమ బహుమతి షీల్డ్, రూ.30 వేల నగదు, యాదాద్రి లైన్స్ వారికి షీల్డ్, రూ.15వేల నగదును దాతలు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, పల్లెర్ల కళ్యాణివెంకన్న అందజేశారు. కార్యక్రమంలో పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కారుపోతుల వెంకన్న, నిమ్మల శ్రీనివాస్, బొల్లెపల్లి శ్రావణ్‌కుమార్, విక్రమ్, లక్ష్మీనారాయణ, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

మోత్కూరు : అవార్డులు బాధ్యతను పెంచుతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సూరోజు భాస్కరాచారి అన్నారు. మున్సిపల్ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చేతరాశి అంజయ్య ఇటీవల పుడమి సాహితీ సంస్థ ద్వారా ఉత్తమ సామాజిక సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి యామగాని బుగ్గయ్య, మండల బాధ్యులు వారాల యాదగిరి, మొగుళ్లపల్లి సోమయ్య, సుబ్రహ్మణ్యశర్మ, మహేశ్వరం రామయ్య, యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పలయ్య, సత్తయ్య, వెంకన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణ, భిక్షం పాల్గొన్నారు.

నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలి

మోత్కూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అవలంబిస్తున్న నిరంకుశ విధానాలను వామపక్ష, ప్రజాతంత్ర, లౌకికవాదులు ఏకమై తిప్పికొట్టాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. బుధవారం మండలంలోని పాలడుగులో పార్టీ గ్రామ శాఖ సమావేశం వెండి యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో చంద్రయ్య, నాయకులు ముత్తమ్మ, సోమరాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చిరుమర్తి లింగయ్యపై ఫిర్యాదు

ఆలేరురూరల్ : బీజేపీ నాయకుల కుటుంబాలపైన, మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. అంతకుముందు పట్టణంలోని ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సముద్రాల కల్పన, కీర్తి, శ్రీనివాస్, జహంగీర్, దశరథ, రాజు, సిద్దులు, శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు.